
తెలుగు డైలీ డిజిటల్
# సిరి
...People Voice | www.siridaily.com
శనివారం, ఫిబ్రవరి 22, 2025 | సంపుటి-1 సంచిక-72 పేజీలు - 10
The Largest Readers Local Digital



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వింతపోకడ
- అవాక్కవుతున్నఅభ్యర్థులు
- ఇదేం కొత్త ఒరవడి అంటూ ఆందోళన
- అభాసుపాలవుతున్న స్ఫూర్తిదాతలు
- చైతన్యపర్చాల్సిన వారే తప్పుదారి పడుతున్నారా ?
- గ్రూపులుగా మారి తాయిలాలకు పట్టబడుతున్న పట్టభద్రులు, టీచర్లు

4

# ఓటేస్తాం మాకేంటి!?

## ఓటుకు నోటు బాటలో మేధావులు?



ఎన్నికలు వస్తే చాలు.. విద్యావంతులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, ప్రొఫెసరు ఓటర్లను చైతన్యపరుస్తూ ఓటును అమ్ముకోవద్దంటూ, దానివల్ల వచ్చే పరిణామాలను వివరిస్తూ సోషల్ మీడియా స్ఫూర్తిదాయక అంశాలను పెడుతూ ఉంటారు. ఓటు వేయాలని, అభ్యర్థులు, పార్టీలు ఇచ్చే తాయిలాలు తీసుకోవద్దని, ఒకసారి అమ్ముడుపోతే అయిదేళ్లు కష్టాలు అనుభవించాల్సి వస్తుందని అప్రమత్తం చేస్తుంటారు.. కానీ ఈసారి రూటు మారింది..చైతన్యవంతం చేయాల్సిన మేధావులు తాయిలాల వైపు మొగ్గు చూపుతున్నారు.. అందరిలా మేమూ అంతే అని నిరూపించుకుంటున్నారు.. సోషల్ మీడియా ద్వారా నీతులు చెప్పే గ్రాడ్యూయేట్లు, విద్యావంతులు, ఉపాధ్యాయులే ఓట్లమ్ముకుంటున్న వైనంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు..

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)



# రాష్ట్రంలో సీఎం తప్ప ఇంకేం మారలే

- తెలంగాణ ప్రజల బ్రతుకుల్లో మార్పు రాలే
- బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది
- మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన
- దేశంలో డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2

## మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి
# గుండె శస్త్ర చికిత్స
### ప్రస్తుతం నిలకడగానే ఆరోగ్యం



(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్) నిరాడంబరుడు. నిగర్వి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత చిలుముల మదన్‌రెడ్డికి గుండె సంబంధ శస్త్ర చికిత్స జరిగింది. ఇటీవల ఆయన గుండె సంబంధిత సమస్యతో బాధపడ ుతుండగా ఇటీవల హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. మదన్‌రెడ్డికి గుండె ఆపరేషన్ జరిగిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. అయితే ఆపరేషన్ సక్సెస్ కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.



# ఆగని నిరసనలు

### దంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటం

- రిలే నిరాహార దీక్షలో దారుగుల్ల గ్రామస్తులు
- నల్లటి దుస్తులు, నల్లని బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ

2

# విలువలు నేర్పే విద్యాలయంగా సెయింట్ ఆంథోనీస్



## ఘనంగా 25వ వార్షికోత్సవ సంబరాలు

- కర్తవ్యం..సేవ.. స్వచ్ఛత అనేదే వారి నినాదం
- పాతికేళ్లుగా విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తున్న పాఠశాల
- అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధన
- శారీరక, మానసిక ధృఢత్వాన్ని పెంచేందుకు క్రీడల్లో శిక్షణ
- అపారమైన పుస్తక సంపద కలిగిన లైబ్రరీ
- నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం
- అంకితభావంతో ముందుకువెళ్తున్న ఛైర్మన్ సోలమన్ రెడ్డి

కర్తవ్యం..సేవ..స్వచ్ఛత అనే నినాదంతో స్థాపించిన విద్యాలయం ఎందరో విద్యార్థులకు ఉన్నత మార్గాలకు నిలయంగా మారింది. 25 ఏళ్ళ క్రితం స్థాపించిన పాఠశాల ఆదర్శంగా నిలిచి వేలాది మంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తుంది..అదే సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనిస్ ఉన్నత పాఠశాల.. 25వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా సిరి పత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం..

3

# సాగుకు నీళ్లివ్వండి

- ఆందోళనలో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలి
- రంగనాయక సాగర్ లో రెండు విడుతలుగా నీటిని పంపింగ్ చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ



10

# రాష్ట్రంలో సీఎం తప్ప ఇంకేం మారలే

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**మెదక్ టౌన్, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్)** సీఎంలు మారారే గానీ తెలంగాణ పాలనలో ఎలాంటి మార్పు లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్ లో విలేకరుల సమావేశంలో అన్నారు.రాబోయే శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలన్నారు.ఎన్నికల తరువాత ప్రజా సమస్యలపై ఉద్యమబాటలో పయనిస్తామన్నారు.అనేక రాష్ట్రాల్లో మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందో చూస్తున్నారని చెప్పారు. కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో అవినీతి, అక్రమ ప్రభుత్వాల చేతకాని విధానాల వల్ల కనీసం జీతాలివ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎద్దేవా చేశారు.ఇచ్చిన గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీల మాట దేవుడెరుగు, కనీస హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో 14 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పులకుప్పగా మార్చాయని మండిపడ్డారు.

### దశ, దిశను సూచించే ఎన్నికలు.

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర దశ దిశను సూచించే ఎన్నికలని కేంద్రమంత్రి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ లో శుక్రవారం ఉదయం ఉపాధ్యాయులతో జరిగిన మీట్ అండ్ గ్రీట్ లో పాల్గొని ప్రసంగిస్తూ బీఆర్ ఎస్, కాంగ్రెస్ విధానాలను తూలనాడారు. మేధావులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో చతికిలపడిందని ఎద్దేవా చేశారు.నిరుద్యోగ భృతి రూ. 4వేలు, మహిళలకు రూ. 2500, ప్రతీ దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు, రైతులు, రైతు కూలీలకు ఆదుకుంటామన్న హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీలిచ్చి ఇప్పుడు వారిని కనీసం కలవడం కూడా లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చినవి, చేసినవన్నీ మోసపూరిత హామీలేనని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఇంకేం లేవన్నది తేలిపోయిందని కేంద్రమంత్రి విమర్శించారు. తెలంగాణలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని, ఉద్యోగులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, 5 డీఏలపై మాట్లాడే పరిస్థితి లేదన్నారు.మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని అదే దిశలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలు, అహంకారపూరిత చర్యలు, అధికార దుర్వినియోగం తప్ప ఇరు ప్రభుత్వాల పాలనలో మార్పు ఏమీ లేదన్నారు. మార్పు వచ్చిందంటే కేవలం కేసీఆర్,రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కుటుంబాల్లోనే వచ్చిందని విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

### ప్రజాతీర్పు బీజేపీ వైపే..

ఈ శాసనమండలి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైఫల్యానికి వ్యతిరేకంగా రానుందని బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఈ మార్పులో విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు కీలక పాత్ర పోషించి మోదీ ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకోవాలని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంతో తమ పార్టీకి మరింత మద్దతు లభిస్తుందని దీంతో మరింత బలపడి ప్రభుత్వాల మెడలు వంచే ఉద్యమబాటలో పయనిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మొగులయ్య, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

- దంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటం
- రిలే నిరాహార దీక్షలో దారుగుల్ల గ్రామస్తులు
- నల్లటి దుస్తులు, నల్లని బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ

# ఆగని నిరసనలు




**గుమ్మడిదల రూరల్, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** రైతు లేనిదే రాజ్యం లేదు అన్న విషయం ప్రతి ఒక్కరికి తెలియాలని జేఏసీ నాయకులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. గత 17 రోజులుగా డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు నల్లటి దుస్తులు ధరించి నల్లని బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు ప్రతినిత్యం డంపింగ్ యార్డ్ వల్ల ప్రమాదం ఉన్నదని ప్రతి మహిళా గ్రామంలో నుండి నిరసన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. రైతు లేనిదే రాజ్యము లేదని రైతు పంట పండిస్తూనే పదిమంది కడుపు నిండుతుందని ఆ పచ్చని పంట పొలాలను నాశనం చేస్తే రైతు ఎలా బతుకుతాడని నినాదాలు చేస్తూ ర్యాలీ ముందుకు తీశారు. డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా శాంతియుతంగా కార్యక్రమాలు చేపడుతున్నందున పోలీస్ పహారా ఎత్తివేశారు. గత 12 రోజులుగా గుమ్మడిదలలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా దారు గుల్ల గ్రామానికి చెందిన గ్రామస్తులు నిరసన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఇప్పటివరకు మీ దగ్గర గ్రామాల రైతులు, గుమ్మడిదల రైతు సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, దివాంగులు , ముదిరాజ్ సంఘం 2, మైనార్టీ సోదరులు, అంబేద్కర్ యువజన సంఘం, విశ్వకర్మ సంఘం, బ్రాహ్మణ సంఘం, గౌడ సంఘం, వర్తక సంఘం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.



### నిలిచిపోయిన సర్వే పనులు..



గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారా నగర్ డంపింగ్ యార్డ్ సర్వే ను రైతులతో కలిసి గుమ్మడిదల రైతు సంఘం సభ్యులు, జెసి నాయకులు,ఊ ప్యారా నగర్ నల్లవల్లి గ్రామస్తులు సర్వేలో పాల్గొన్నారు. అధికారులు సర్వే డిపార్ట్మెంట్ వాళ్లు రాంకీ సంస్థకు అనుకూలంగా సర్వేఉ నిర్వహించడానికి ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాన్ని రైతులందరూ తీవ్రంగా వ్యతిరేకించడంతో సర్వే పనులు అక్కడే నిలిచిపోయినాయి.

### బీటీ రోడ్డు పనులు పూర్తి..



నర్సాపూర్ గుమ్మడిదల ప్రధాన రహదారి నుండి డంపింగ్ యార్డ్ వరకు బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేశారు ఆందోళన కార్యక్రమం చేపడుతున్నప్పటికీ పోలీస్ పహారా మధ్య ప్రధాన రహదారి నుండి డంపింగ్ యార్డ్ స్థలం వరకు బీటీ రోడ్డును పూర్తి చేయడంతో పాటు రెండువైపులా సిమెంట్ పలకలను వేయడానికి పోల్స్ ఏర్పాటు చేసి వదిలేశారు అదేవిధంగా డంపింగ్ యార్డ్ పోయే ప్రాంతానికి గేటు సైతం ఏర్పాటు చేశారు రోడ్డుకు రెండు వైపులా రిజర్వ్ ఫారెస్ట్ ఉండడం వల్ల అందులోకి ఎవరు పోకుండా పలకలను ఏర్పాటుకు పూనుకున్నారు.






**కర్తవ్యం.. సేవ..స్వచ్ఛత అనే నినాదంతో స్థాపించిన విద్యాలయం ఎందరో విద్యార్థులకు ఉన్నత మార్గాలకు నిలయంగా మారింది. 25 ఏళ్ళ క్రితం స్థాపించిన పాఠశాల ఆదర్శంగా నిలిచి వేలాది మంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తుంది..అదే సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనిస్ ఉన్నత పాఠశాల..25వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా సిరి పత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం..**

# విలువలు నేర్పే విద్యాలయంగా సెయింట్ ఆంథోనీస్

## ఘనంగా 25వ వార్షికోత్సవ సంబరాలు

- కర్తవ్యం.. సేవ.. స్వచ్ఛత అనేదే వారి నినాదం
- పాతికేళ్లుగా విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తున్న పాఠశాల
- నాణ్యమైన విద్యతో విద్యార్థులకు అవకాశాల సృష్టి
- అనుభవుజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధన
- శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంచేందుకు క్రీడల్లో శిక్షణ
- అపారమైన పుస్తక సంపద కలిగిన లైబ్రరీ
- నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం
- అంకితభావంతో ముందుకువెళ్తున్న ఛైర్మన్ సోలమన్ రెడ్డి

### ఘనంగా రజతోత్సవ వేడుకలు

సెయింట్ ఆంథోనీస్ పాఠశాల ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తవడంతో గురువారం నాడు రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ భువనగిరి ఫణి పవన్ ఫౌండర్ సి.ఇ.ఒ ఆఫ్ ఈ అభ్యాస్, సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత పాపులమ్మ సోలోమోన్ రెడ్డి , లీడ్ అకాడమిక్ డైరెక్టర్ దినేష్ రెడ్డి, ముని చౌదరి, కుమారి వరలక్ష్మి అకాడమిక్ డైరెక్టర్, ఎక్స్లెన్స్ అడ్వైజర్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్, సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల స్వాగత గీతంతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు వివిధ రకాల డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి.




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 21(సిరిన్యూస్)** మంచి దూరదృష్టితో వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాలు ఉన్న పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 1999లో సోలమన్ రెడి సంగారెడ్డిలోని శాంతినగర్‌లో సెయింట్ ఆంథోనిస్ ఉన్నత పాఠశాలను స్థాపించారు. నాటినుంచి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దారితీసే స్వీయ అభ్యాసకులుగా చేయడం ద్వారా వారి అభ్యాస అనుభవాన్ని మెరుగుపరస్తున్నారు. నాణ్యమైన విద్య ద్వారా విద్యార్థులకు అంతులేని అవకాశాలను సృష్టించడం, వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తున్నారు.నర్సరీ నుంచి 10వ తరగతి వరకు తొలుత 538 విద్యార్థులతో ప్రారంభమైన ఆంథోనీస్ హైస్కూల్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 3వేలకు చేరుకుంది. పాతికేళ్లుగా ఎక్కడా రాజీపడకుండా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం, దృక్పథం, అంకిత భావంతో ముందుకువెళ్తున్నారు. సెంయిట్ ఆంథోనిస్‌లో 150మంది అర్హత గలిగిన, అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు, 12మంది అడ్మినిస్ట్రేటివ్, సాంకేతిక సిబ్బంది , శానిటరీ విభాగంలో 30మంది సహాయకులు, విద్యార్థులను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లి, బడికి తీసుకొచ్చేందుకు 30మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఇక పాఠశాలలో మౌలిక వస తుల విషయానికొస్తే.. విశాలమైన తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, జ్ఞానాన్ని పెంపొందించే వివిధ రకాల పుస్తకాలతో కూడా పెద్ద గ్రంథాలయం, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయి.



## క్రీడల్లో స్ఫూర్తి కలిగిస్తూ....

విద్యార్థుల్లో శారీరక, మానసిక ధృడత్వాన్ని, స్నేహభావాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ క్రీడలు నిర్వహించడంతోపాటు శిక్షకుల సహాయంతో వారిలో ఆయా క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు. క్రీడలకు అవసరమైన ఇండోర్, అవుట్‌డోర్ ఆటలకు అనువైన స్థలం కూడా ఉంది. ఈ పాఠశాలల్లో చదువుతున్న కొంత మంది విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో క్రీడాపోటీల్లో పతకాలు సాధించడం విశేషం. కరాటే, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు. సెయింట్ ఆంథోనీస్ విద్యా, క్రీడలు, సాంస్కృతిక , సాహిత్యం వంటి అన్ని అంశాలలో శిక్షణను ఇవ్వడంతోపాటు విద్యార్థులలో ఆయారంగాలలో నైపుణ్యాభివృద్ధి చేస్తున్నారు. సెయింట్ ఆంథోనిస్ కేవలం పాఠశాల విద్యకే పరిమితం కాకుండా ఛైర్మన్ సోలమన్ రెడ్డి 2001 ఇంటర్ కాలేజీ, 2021లో డిగ్రీ కాలేజీని స్థాపించడం ద్వారా సెయింట్ ఆంథోనిస్ సంస్థలను విస్తరించారు. ఛైర్మన్ సోల్‌మన్ రెడ్డి మాట్లాడుతూ 1999ల సెయింట్ ఆంథోనిస్ స్కూల్ ప్రారంభించనప్పుడే సంగారెడ్డి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. నాటి నుంచి ఇక్కడ ప్రజల , మా పాఠశాలను నమ్మి తమ పిల్లలను పంపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎనలేనిది. అంతేగాకుండా మాకు మద్దతునిచ్చిన శ్రేయోభిలాషులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయ కులు రుణపడి ఉంటాం. సెయింట్ ఆంథోనీస్ లో విద్యార్థులకు బలమైన పునాది వేయడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధిపై దృష్టిసారించి వారిని ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎల్లవేళలా కృషిచేస్తున్నా..ఇక ముందుకొనసాగిస్తాం. 21వ శతాబ్దపు అన్ని నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు మేము మా విద్యార్థులను సిద్ధం చేస్తాం.విజయవంతమైన వ్యక్తిగానే కాకుండా, విలువైన వ్యక్తిగా మార్చడానికి ప్రయత్నిస్తాం. 25ఏళ్ల మా ప్రస్థానమే మా విశ్వసనీయతకు నిదర్శనం.



# ఓటేస్తాం మాకేంటి!?

## ఓటుకు నోటు బాటలో మేధావులు?

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వింతపోకడ
- అవాక్కవుతున్నఅభ్యర్థులు
- ఇదేం కొత్త ఒరవడి అంటూ ఆందోళన
- అభాసుపాలవుతున్న స్ఫూర్తిదాతలు
- చైతన్యపర్చాల్సిన వారే తప్పుదారి పడుతున్నారా ?

### గ్రూపులుగా మారి తాయిలాలకు పట్టబడుతున్న పట్టభద్రులు, టీచర్లు

(ప్రత్యేక ప్రతినిధి -సిరిన్యూస్) కరీంనగర్, నిజామబాద్, మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనుంది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఓటు వేయమని పట్టభద్రుల దగ్గరకు, ఉపాధ్యాయుల దగ్గరకు వెళ్తే వారికి అవాక్కయ్యే సంఘటనలు ఎదురవుతున్నాయి. మీకు ఓటేస్తే మాకు ఎంతిస్తారని అడగడం విశేషం. దీంతో అభ్యర్థులు, వారి తరుపున ప్రచారం చేసేవారు ఖంగు తింటున్నారు. విద్యావంతులైన పట్టభద్రులు, రేపటి పౌరులను తయారుచేసే ఉపాధ్యాయులే ఇలా ఉంటే రెక్కాడితే గాని డొక్కాడని పేదలు, నెలరోజు జీతం ఆలస్యమైతే కకావికలమయ్యే మధ్యతరగతి వాళ్లు ఓటు అమ్ముకోవడంలో ఆశ్చర్యమేముందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### సామాజిక బాధ్యత మరవద్దు...

రాజకీయం అనేది ప్రజల కోసం ప్రజా ప్రతినిధి చేయాల్సిన గొప్ప సామాజిక బాధ్యత. కానీ ఇప్పుడు ఇది అధికారం, హోదా కోసమే అన్నట్లుగా మారిపోయింది. ప్రశ్నించలేని అమాయక పేదల ఓట్లతో గద్దె నెక్కడం, అధికారాన్ని అనుభవించడం ఆస్తులు కూడబెట్టుకోవడమే రాజకీయ నాయకుల లక్ష్యంగా మారిపోయింది. ఈ వ్యవహారం తరతరాలుగా కొనసాగుతూ వస్తున్నది. ఎన్నికల ముందు అద్భుతమైన ప్రసంగాలు, పేదోడిని గుండెలకు హత్తుకున్నా... అధికారంలోకి వచ్చిన తరువాత పేదోడి గుండెల మీద తన్నడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారిపోయింది. ఇందుకు కారణం ఓటు అమ్ముకోవడమే. నేడు పట్టభద్రుల, ఉపాధ్యాయుల విషయంలో కూడా అలానే జరుగుతుంది. గతంలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఏ అభ్యర్థులు వారి గురించి శాసనమండలిలో చర్చించలేదు. ఇప్పటికైనా పట్టభద్రులు ఆలోచించుకోవాలి. చదువుకున్న వ్యక్తులుగా, ఓటు పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన పట్టభద్రులుగా రేపటి భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకోవలసిన అవసరం ఉంది. ఇప్పటి ఎన్నిక ఒక ఎమ్మెల్సీ స్థానం కోసమే అయినా ఓట్ల ప్రభావం శక్తివంతమైనది కాబట్టి ప్రజల తరుపున గళమయ్యే శక్తిని, సబ్బండ వర్గాల ఆవేదనను అర్థం చేసుకునే వారిని కాకుండా.. ఇతరులను ఎన్నుకున్నా, నిర్లక్ష్యంగా ఓటు వేసినా చదువుకున్న మేధావులకు ఏ విలువ ఉండదనే సంగతిని మర్చిపోవద్దు. ఆశల్లో, నిండా ఆవేదనల్లో ఉన్న తెలంగాణాకు ఇప్పుడు పదునైన గొంతుక కావాలి. పట్టభద్రుల, ఉపాధ్యాయుల తరుపున పోరాడే నాయకుడు కావాలి. అందుకే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటును అమ్ముకోకుండా ఆయుధంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందనేది నగ్నసత్యం.

### యువశక్తిని వెలికి తీయాలి...

ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడిన యువశక్తి తెలంగాణాలో ఉంది. కానీ అనేక మంది వివిధ రాజకీయ పార్టీల పక్షాన నిలవడంతో ఇప్పుడు తెలంగాణాలో ప్రశ్నించేతత్వం రోజురోజుకూ కనుమరుగవుతూ వస్తుంది. అందుకే చదువుకున్న యువత దూరదృష్టితో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఓ వైపు రాజకీయ ప్రలోభాలతో రాజకీయ వ్యవస్థ పూర్తిగా పతనమవుతూ వస్తుంది. మరోవైపు అవినీతి కోరలు చాచుకొని పేదోడిని వెంటాడుతుంది. ఈ మధ్య రాష్ట్రంలో జరిగిన అనేక ఏసీబీ దాడుల్లో చిన్న స్థాయి ఉద్యోగి నుంచి అడిషనల్ కలెక్టర్ దాకా పట్టుబడిన వారు ఉన్నారంటే రాజకీయ వ్యవస్థ ఎంత స్తబ్దుగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ చదువుకున్న యువత స్వతంత్రంగా రాజకీయ వ్యవస్థను కాపాడే శక్తిలా ఎదగలేకపోతున్నారు. రాజకీయ ప్రలోభాల మాయలో పడి.. సమాజ విచ్ఛిన్నానికి పట్టభద్రుడు కారణం అవుతున్నాడు. అటువంటి శక్తులను, అవినీతి వ్యవస్థను అడ్డుకోవడానికి పట్టభద్రులు పదునైన ప్రశ్నించే గొంతుకలుగా ప్రజల తరుపున నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### నిర్లక్ష్య ధోరణి విడిచిపెట్టాలి...

గతంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అనేక మంది పట్టభద్రులు నిర్లక్ష్యంగా ఓట్లు వేయడం చూస్తే సమాజం పట్ల వారికి ఉన్న అస్పష్టతను తెలియజేస్తుంది. ఆ ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు చెల్లకుండా మారిపోయాయి. అంతటి నిర్లక్ష్య ధోరణిలో పట్టభద్రులు ఉన్నారు. ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సమీపిస్తోంది. దాదాపు 42 నియోజకవర్గాల్లోని పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. అయితే ఆయా ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే ఓట్ల కోసం ఓట్ల నమోదుతోనే పట్టభద్రులను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు ఈ పట్టభద్రుల ఓట్లతో అధికారం కోసం ఆరాటపడుతున్నారు. ఇటువంటి సమయంలో ఇప్పుడు తెలంగాణలో ప్రతీ పట్టభద్రుడు తెలంగాణ సమాజం పక్షాన ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రశ్నించే గళాలుగా ప్రజల తరుపున స్వతంత్ర శక్తిగా నిలవకుండా రాజకీయ ప్రలోభాలకు పట్టభద్రుడు అమ్ముడుపోతే ఈ సమాజం మరింత అంధకారంలోకి వెళ్లే పరిస్థితి ఉంటుంది. సమాజం తెలిసిన వ్యక్తిగా చట్టసభల్లో మన ఆవేదనలకు రూపాన్ని ఇచ్చే వ్యక్తుల వెంట పట్టభద్రులు అంతా ప్రశ్నించే గళాలుగా తెలంగాణ సమాజం కోసం ఆయుధంగా నిలబడాల్సిన అవసరం ఉంది.

## కుక్కల దాడిలో యువకుడి మృతి


**నారాయణఖేడ్ ఫిబ్రవరి 21 (సిరి న్యూస్)** కంగ్టి మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి (27) గత రెండు నెలల క్రితం పట్టణంలో కుక్కలు 15 మందిపై దాడి చేశాయి. అందులో శ్రీకాంత్ రెడ్డి ఒక్కరు. మిగతా 14 మందికి కాళ్లకు చేతులకు కుక్కలు కరువగా వారికి స్థానికంగానే చికిత్స అందించారు. ఈ శ్రీకాంత్ రెడ్డి కి గొంతు భాగంలో కరవడంతో ఆయన్ను హైద్రాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా శుక్రవారం నాడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకాంత్ రెడ్డి తండ్రి 10 సంవత్సరాల క్రితమే మృతి చెందాడని అన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీకాంత్ రెడ్డి మృతి చెందడంతో వికలాంగురాలైన తల్లి పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## దాబా, స్వీట్ హౌస్ సీజ్

**ఝరాసంగం ఫిబ్రవరి 21 సిరి న్యూస్:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఓ స్వీట్‌హౌస్, సంగం ( కె) గ్రామ శివారులో గల మిలాన్ దాబాను జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్, స్థానిక తహశీల్దార్ తిరుమల రావులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శుక్రవారం సీజ్ చేశారు. ఆహారంలో నాణ్యత ప్రమాణాలను పాటించక పోవడం వల్లే వాటిని సీజ్ చేయడం జరిగిందన్నారు. హోటల్, స్వీట్ దుకాణాల యజమానులు శుభ్రత పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో ఏర్పాటు చేసే దుకాణాల దారులు తప్పని సరిగా తినుబండారాల తయారీలో నాణ్యత పాటించాలన్నారు.





# కార్యదర్శిని విధుల నుంచి తొలగించాలి



**గజ్వేల్ ఫిబ్రవరి 21(సిరి న్యూస్):** మాదిగ వర్గీయ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంచాయితీ కార్యదర్శిని విధులు నుండి బహిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఇలాంటి సంస్కృతి గ్రామాల్లో పాతుకు పోతుందంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండల పరిధిలోని వాగునూతి పంచాయతీ కార్యదర్శి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఫోన్ లో సంభాషిస్తూ మాదిగ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కులస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా పంచాయితీ కార్యదర్శి యధావిధిగా విధులకు హాజరవుతుండటంతో రెండు రోజుల క్రితం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్, ములుగు మండల అధ్యక్షుడు ఆదాసు మహేష్, ఆయా మండలాల నాయకులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ కి పంచాయితీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. అధికారుల సూచన మేరకు శుక్రవారం డీపీఓ లత వాగునూతి గ్రామానికి విచారణ నిమిత్తం వచ్చి ఇరువర్గాల వాదనలు విన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్నామని, ఈ విచారణ పత్రాలను పై అధికారులకు నివేదిక పంపుతామని డిపిఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు బుడిగే మహేష్, ములుగు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆదాస్ మహేష్, జగదేవపూర్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు, జగదేవపూర్ మండల ఉపాధ్యక్షులు జంగని బాలకృష్ణ, ములుగు మండల ఎంఆర్పిఎస్ కార్యదర్శి కొమ్ము వినోద్, క్షీరసాగర్ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు గుడ్ల అశోక్, నల్ల శ్రీనివాస్, ఆదాసు సురేందర్, నరేందర్, పోచయ్య, వెంకటేష్, మండల ఉపాధ్యక్షులు కొక్కొండ మల్లేష్, మామిడాల మల్లేష్, నాయకులు గణేష్, సాదుల్, నాగేష్, సత్యనారాయణ, ములుగు మండలంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

### గజ్వేల్‌కు చేరుకున్న భద్రాచలం

# గోటి తలంబ్రాలు రామకోటి రామరాజు కృషి

**గజ్వేల్ ఫిబ్రవరి 21(సిరి న్యూస్):** భద్రాచలం సీతారాముల వారి కళ్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు వాడుతారు. వీటికి సంబందించిన వడ్లు శుక్రవారం రోజు భద్రాచలం నుంచి 250 కిలోల వడ్లు గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థకు అందాయి. రామాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతానికి ముచ్చటగా మూడవసారి గోటి తలంబ్రాలు (వడ్లు) తీసుకురావడం తెలంగాణ ప్రాంతం నుంచి రామకోటి సంస్థకు అవకాశం ఇవ్వడం రామకోటి రామరాజు భక్తికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కృష్ణాలయం ప్రతినిధులు యెలగందుల రాంచంద్రం, ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రాములు, అత్తెలి లక్ష్మయ్య, మరియు గుంటుకు శ్రీను, సమీర్, నక్క రాములు గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

**అభినందనీయం: మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి**



# డిసిసి అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డికి ఘన సన్మానం



**గజ్వేల్ ఫిబ్రవరి 21(సిరి న్యూస్):** గజ్వేల్ మున్సిపాలిటీలోని పోస్ట్ ఆఫీస్ ఐఓసీ భవనంలో మొదటి అంతస్తులో ఉండడంతో పోస్ట్ ఆఫీస్ ఖాతాదారులు అలాగే వృద్ధులైన పెన్షన్ దారులు చాలా ఇబ్బందుల గురి అయ్యారు. ఈ విషయంలో నర్సారెడ్డి చొరవ తీసుకొని కలెక్టర్ తో మాట్లాడి పోస్ట్ ఆఫీస్ ను అందరికీ అణువుగా ఉండే విధంగా గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేయించడం జరిగింది. ఈ విషయమై నర్సారెడ్డిని కలిసి ఆయనకు కృతజ్ఞత తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రెటరీ సాజీద్ బేగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్ డాక్టర్ వహీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మైనారిటీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సమీర్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు జాంగిర్, యూత్ కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ నేత నాగరాజు, ధర్మారెడ్డి పల్లి మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి, ఉడెం శ్రీనివాస రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, చెప్యాల శేఖర్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ మోడల్ హౌస్ కు భూమి



**పూజఝురాసంగం, ఫిబ్రవరి 21 సిరి న్యూస్:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు భాగంలో శుక్రవారం తహసిల్దార్ తిరుమలరావు, మండల అభివృద్ధి అధికారి సుధాకర్ మోడల్ ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ తదితరులు ఉన్నారు.

# తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలి



**గుమ్మడిదల, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** తల్లిదండ్రులను ఎల్లప్పుడూ ప్రేమానురాగాలతో గౌరవించాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ సూచించారు. గుమ్మడిదల శ్రీ కృష్ణానంద సరస్వతీ స్వామి ఆశ్రమంలో భక్తులనుద్దేశించి మాధవానంద సరస్వతి స్వామి ప్రవచిస్తూ సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలలో పాల్గొంటే జీవనం సుఖశాంతులతో విరజిల్లుతుందని తెలిపారు. మనం చేపట్టే కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులపై ఎల్లవేళలా గౌరవించాలని, ప్రేమతో చూసుకోవాలని తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత చేబోతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చెడును పాలదోలి మంచివైపు ప్రయాణించాలన్నారు. అప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరికి గౌరవం లభిస్తుందన్నారు.

# మాతృభాష కంటే మాధుర్యమైనదే లేదు
## కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖిల్



**అంజుమ్గజ్వేల్ ఫిబ్రవరి 21(సిరి న్యూస్) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని మాతృభాష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ , నిఖత్ అంజుమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను కాపాడుకుంటూ పరభాష జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ గణపతి రావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే చాలా గిరిజన భాషలు కనుమరుగయ్యాని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా గిరిజనులకు పైనే ఉందని స్పష్టం చేశారు. కళాశాల ఐ క్యుచేశారు. కోఆర్డినేటర్ డాక్టర్ డి వెంకటేష్ మాట్లాడుతూ మాతృభాషలో పట్టు ఉంటే ఎన్ని భాషలు అయినా సులభంగా నేర్చుకోవచ్చని అన్నారు. తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ ఆర్ మహేందర్ రెడ్డి మాతృభాషలో పట్టు సాధిస్తే మిగతా సబ్జెక్టుల విషయాలు సులభంగా అర్థమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాల్గొనడం జరిగింది.

## బీసీలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



**వెల్దుర్తి ఫిబ్రవరి 21 సిరి న్యూస్:**మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో బీసీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి నల్ల చెరువు నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల చేసిన బీసీ కులఘనన సర్వే తప్పుల తడకగా ఉందని, కాంగ్రెస్ పార్టీ మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, మల్లు భట్టి విక్రమార్క మళ్లీ బీసీ కుల గణన సర్వేకు అవకాశం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని జనాభా దామాషా ప్రకారం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అత్యధిక అవకాశాలు కేటాయించాలని నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు, అదేవిధంగా రాబోయే చట్టసభల్లో కూడా రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు, చట్టసభల్లో బీసీ జనాభా ప్రకారం 60 శాతం ఎమ్మెల్యేలు ఉండాలని కానీ కేవలం 10 శాతం మాత్రమే చట్టసభల్లో బీసీ ఎమ్మెల్యేలు ఉన్నారని, జనాభా దామాషా ప్రకారం అత్యధికమైన బీసీ కమ్యూనిటీ కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా, జెండాలు మోసే కూలీలుగా తయారయ్యారని, గంపెడు శాతం ఉన్న బీసీలు జెండా కూలీలుగా మారారని, పిడికెడు శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజ్యాలు ఏలుతున్నారు , అత్యధికంగా ఉన్న బీసీలు జెండాలు వదిలి, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ నీ ఆదర్శంగా తీసుకోవాలని నల్ల చెరువు నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు.

## కొనసాగుతున్న పారిశుధ్య పనులు



**ఝరాసంగం ఫిబ్రవరి 21 సిరి న్యూస్:** శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శుక్రవారం స్థానిక తహసిల్దార్ తిరుమలరావు , మండల అభివృద్ధి అధికారి సుధాకర్ పారిశుద్ధ్యం పనులు ఎక్స్ వెంటర్ సహాయంతో చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతర ఉత్సవాలకు వచ్చే భక్తుల ఆలయ పరిసరాల్లో గల హోటల్ యజమాన్యులు నాణ్యతమైన తినుబండారాలను విక్రయించాలన్నారు.నాసిరకం వస్తువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



**ఝరాసంగం ఫిబ్రవరి 21 సిరి న్యూస్:** :పోషకహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఐకెపి ఎపిఎం టిక్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోనీ ఐకెపి కార్యాలయంలో ఆయా గ్రామాల మహిళ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. భోజనం చేసే ముందు చేతులు పూర్తిగా శుభ్రం చేసుకోవాలన్నారు. చిన్నారులకు వ్యాధులు సక్రమించకుండా పరిసరాల శుభ్రతతో పాటుగా వ్యక్తి గత శుభ్రత కూడా తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీలు మల్లేశం,యాదయ్య,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణ



- శిక్షణకు జిల్లాలో 118 మంది మహిళల ఎంపిక
- మూడు విడతల్లో శిక్షణ..ఒక్కో విడతలో 35మంది మహిళలకు ఆరు రోజుల శిక్షణ
- ఇటుకల తయారీ, ఇండ్ల నిర్మాణం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 21(సిరి న్యూస్ ):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. సంగారెడ్డి ప్రభుత్వ ఐటిఐ లోని న్యాక్ శిక్షణ కేంద్రం లో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇండ్ల నిర్మాణం, సిమెంట్ ఇటుకల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి మండలానికి ఐదు మంది చొప్పున ఆసక్తి అనుభవం ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇటుకల తయారీ , ఇండ్ల నిర్మాణం పై శిక్షణ కార్యక్రమాన్ని న్యాఖా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో విడతలో 35 మందికి ఆరు రోజుల శిక్షణ ఇవ్వన్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ శిక్షణ వల్ల గ్రామాల లో ఎక్కడికక్కడ ఇటుకలు తయారు చేసే యూనిట్లు నెలకొల్పడంతో పాటు మేస్త్రిలు అందుబాటులో ఉంటారన్నారు. దీంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు ఇందిరమ్మ ఇల్లా నిర్మాణం పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో తక్కువ ధరకు నాణ్యమైన సిమెంట్ ఇటుకలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ మహిళలకు సూచించారు.

కార్యక్రమంలో న్యాక్ ఏపీడి రామ్, డి ఆర్ డి ఒ పిడి జ్యోతి , అదనపు డి ఆర్ డి ఒ జంగారెడ్డి , డి పి ఎం లు మహిళ స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## భక్త మార్కండేయ దేవాలయ ప్రారంభోత్సవం

### మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానం



నారాయణఖేడ్ ఫిబ్రవరి 21 (సిరి న్యూస్) పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భక్త మార్కండేయ మహాదేవాలయ ప్రారంభోత్సవ వేడుకలకు పాల్గొనాల్సిందిగా నారాయణఖేడ్ పద్మశాలీ కులబాంధవులు,ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌లతో కలిసి శుక్రవారం సంగారెడ్డిలో హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజ నరసింహకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పద్మశాలి కుల బాంధవులు మాట్లాడుతూ మార్చి నెల మూడు నుండి ఆరవ తేదీ వరకు నారాయణ ఖేడ్లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న మార్కండేయ మహా దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మార్కండేయ మహర్షి ఆశీస్సులు పొందాలని కోరారు.




# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం



- పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శేట్కర్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ ఫిబ్రవరి 21 (సిరి న్యూస్)** నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టపద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ వుట్కూరి నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీ ఇచ్చి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలిసిన నాయకుడు నరేందర్ రెడ్డి అని కొనియాడారు. బిజెపి పార్టీకి ఈ పట్టబద్రుల ఎన్నికల్లో బుద్ధి చెప్పి మన పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో సమస్యల పరిష్కారానికై కృషి చేసే నరేందర్ రెడ్డి నే భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారితో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి, సోదరుడు వుట్కూరి ఫణిందర్ రెడ్డి, పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, రాకేష్ శేట్కర్ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఆనంద్ స్వరూప్ శేట్కర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్, పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బులోరా వాహనం బోల్తా.. కార్మికుడు మృతి

**రామయంపేట ఫిబ్రవరి 21 (సిరి న్యూస్):** జాతీయ రహదారి 765డిజే పనులు చేస్తున్న కార్మికులతో వెళ్తుతున్న బోలెరో వాహనం బోల్తా పడి ఒక్కరు మృతి చెందిన సంఘటన నిజాంపేట మండల శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే జాతీయ రహదారి 765డిజే పనులు చేస్తున్న 9 మంది కార్మికులతో వెళ్తున్న బోలెరో వాహనం రోడ్డు వెంబడి సైన్ బోర్డు ఏర్పాటు చేయడానికి సిద్దిపేట నుంచి రామాయంపేటకు వస్తున్న క్రమంలో నిజాంపేట గ్రామశివారులోని శిరుక వాగు సమీపంలో బోలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన అమేష్(28) అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి కి తీవ్రగాయాలు, 5గురికి స్వల్ప గాయాలయ్యాయి.వీరిని 108వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐజైపాల్ రెడ్డి తెలిపారు.





# ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు విశేష స్పందన



300 మంది రోగులకు వైద్య సేవలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్ )సంగారెడ్డి పట్టణంలోని రైతు బజార్ ఎదురుగా ఉన్న సాహితీ హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. క్యాంపులో న్యూరాలజిస్ట్ డా, పవన్ కుమార్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ డాక్టర్ అబ్దుల్ రావుఫ్, జనరల్ ఫిజిషియన్ డా, శ్రీనివాస్ తదితర వైద్యులు సేవలందించారు.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన ఈ హెల్త్ క్యాంపులో 500 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సాహితీ రాము మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం న్యూరో సంబంధిత ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 21 ( సిరి న్యూస్ ):** ఈనెల 27న జరగనున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించింది అన్నారు. కావున ఉద్యోగులు 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.

# బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నికలు

**నిబంధనలపై సిబ్బందికి అవగాహన ఉండాలి**

**వృద్ధాప్య పింఛన్లు మాత్రం ఆపకండి**

**ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి**




**సంగారెడ్డి, ఫిబ్రవరి 21 ( సిరి న్యూస్ ):**నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ / జిల్లాఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు ఎన్నికల సిబ్బందికి సూచించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలకు ఆడిటోరియంలో, మైక్రో అబ్జర్వర్లకు సమావేశ మందిరంలో వేరువేరుగా శుక్రవారం రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓ లకు బ్యాలెట్ బాక్సుల వినియోగ విధానం, వాటికి సీల్ వేయడం, పోలింగ్ ప్రారంభానికి ముందే సిద్ధం చేయడం, పోలింగ్ ముగిసిన తర్వాత సీల్ వేసే విధానం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఈ డి ఎస్ సి కార్పోరేషన్ రామాచారి , సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండల అధికారులతో పాటు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఓ.పీ.ఓలు ఎన్నికల సిబ్బంధి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంఘం ఎన్నికలలో సీఐటీయూ జయకేతనం

**శివంపేట్ ఫిబ్రవరి 21(సిరి న్యూస్ ):** మెదక్ జిల్లా శివంపేట మండలంలోని శభాష్‌పల్లి శివారులోని సుగుణ ఫూడ్స్ కంపెనీలో శుక్రవారం జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో సీఐటీయూ మరోసారి జయకేతనం ఎగుర వేసింది. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలలో మొత్తం 58 ఓట్లకు గాను 57 ఓట్లు పోలవగా అందులో సీఐటీయూ తరుపున పోటి చేసిన జె. మల్లిఖార్జున్ కు 39 ఓట్లు రాగా బీఎంఎస్ తరుపున పోటీ చేసిన మల్లేష్ కు 18 ఓట్లు రావడంతో 21 ఓట్ల భారీ మెజారిటీతో సీఐటీయూ విజయకేతనం ఎగురవేసింది. రెండోసారి యూనియన్ ఎన్నికలలో సీఐటీయూ తరుపున జే. మల్లిఖార్జున్ ఎన్నిక కావడంతో కార్మికులు టపాసులు కాల్చుతూ సంబురాలు చేశారు. ఈకార్యక్రమంలో సుగుణ ఫూడ్స్ కంపెనీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఏ. మల్లేశం, ప్రధానకార్యదర్శి యాదగిరి, కోశాధికారి వై. కుమార్, ఇంద్రేష్, శేఖర్, కల్లూరి రాజు, సాయిలు, షబ్బీర్, బిక్షపతి,భాస్కర్,మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మార్చి 8న జాతీయ లోక్ అదాలత్జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ భవాని




**చంద్రసంగారెడ్డి, ఫిబ్రవరి 21 ( సిరి న్యూస్ ):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో సంగారెడ్డి కోర్ట్ నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవాని చంద్ర శుక్రవారం పోలీసు అధికారులకు జాతీయ లోక్ అదాతల్‌పై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యాభర్తల చిన్నచిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చు అన్నారు. న్యాయవాదులు అందరు సహకారం అందించి లోక్ అదాలత్ విజయవంతం చేయాలనీ, కక్షి దారులకు పెద్ద మొత్తం లో నష్టపరిహారం వచ్చేలా కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.జయంతి, 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.పి.కృష్ణార్జున్, జడ్జిలు జి.సునీత, లావణ్య, ఎం.రాధా కృష్ణ చౌహాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి,ఆర్.అనిత అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కె.ధన లక్ష్మి అదనపు పోలీసు సూపరింటెండెంట్ సంజీవరావు, డి సి ఆర్ బి సి ఐ పోలీసు అధికారులు,అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ,మణెమ్మ ఎక్సైజ్ ఎస్సై పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



**రామయంపేట, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్)** హవేలి ఘన్పూర్ మండలం లింగసన్ పల్లి తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈవేడుకలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ని శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దుల్యా నాయక్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రావు,తాజా మాజీ సర్పంచులు రమేష్ నాయక్, శ్రీను నాయక్,బిఆర్ఎస్ పార్టీ తండా అధ్యక్షులు బాబు నాయక్,మాజీ ఎంపిటిసి సూర్య నాయక్, కిషన్ నాయక్,జీవుల నాయక్ రాజ్య నాయక్ ,వినోద్ నాయక్ మోహన్ నాయక్ ,తరుణ్ నాయక్ పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఏడీఏ



**వెల్దుర్తి, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** వెల్దుర్తి , మాసాయిపేట మండల కేంద్రాల్లోని సొసైటీల ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం కౌడిపల్లి ఏడిఏ పుణ్యవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి ఎరువుల నిల్వ వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు విక్రయించే ఎరువులు ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఫర్టిలైజర్ దుకాణాలలో తప్పకుండా ఎరువుల నిలువ బోర్డులను, రైతులకు విక్రయించే ఎరువులకు సంబంధించి తప్పకుండా రసీదు ఇవ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు




- జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్

**చౌటకూర్, ఫిబ్రవరి 22 సిరి న్యూస్ :**కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎలక్షన్లో గుణపాఠం తప్పదని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు చౌటకూర్ మండల్ తాడుధాన్ పల్లి చౌరస్తా వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజలను వంచనకు గురి చేస్తుందన్నారు. ఇచ్చిన గ్యారంటీలకు దిక్కు లేకుండా పోయిందని కొత్త పథకాలను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇప్పుడు దాని ఉసే ఎత్తడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కూడా ఆర్గారంటీ ల పేరుతో మోసం చేయడానికి ఢిల్లీ ప్రజలు బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. మహిళలకు 2500 స్కూటీలు నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయయన్నారు. ప్రజలు కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఈనెల 27న జరుగుతున్న పట్టపద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని అన్నారు బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న చిన్న మైల్ అంజిరెడ్డి నీ భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి నాయకులు ఎంవై రాజ్ కుమార్ పుట్టి మోహన్ చందా పురం ముకుందం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**గుమ్మడిదల, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన అందించి పలువురి అభినందనలు పొందినారు. గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం నాడు స్వయం పరిపా లన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి వాటి తోటి విద్యార్థులకు చక్కటి విద్యాబోధన అందించి పలువురి మన్నలను పొందినారు. అక్షయ ప్రధానోపాధ్యాయురాలుగా, అక్షిత్, హర్షిత్, అశ్విని, భాను ప్రసాద్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. విద్యార్థులను సమాజాన్ని సరైన మార్గంలో ముందుకు తీసుకపోవడంలో ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, యమున పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనంపై ప్రయాగ్‌రాజ్ యాత్ర

**జిన్నారం, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** జిన్నారం మండల ఊట్ల గ్రామానికి చెందిన సాయికుమార్, లక్ష్మణ్ అనే యువకులు ప్రయోగరాజ్ యాత్రకు వెళ్లారు. ఈనెల 18వ తేదీన షాకరిమెట్ల లో ప్రత్యేక పూజలు నిర్వహించి ద్విచక్ర వాహనంపై ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళ కు బయలుదేరారు. దాదాపు 1450 కిలోమీటర్ల కేవలం 22 గంటల్లోనే గమ్యస్థానం చేరుకున్నారు. హిందూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఈ యాత్రను చేపట్టినట్లు యువకులు వెల్లడించారు. యువకులు తలపెట్టిన మహాకార్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.



## భక్త మార్కండేయ దేవాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

- భక్త మార్కండేయ దేవాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్)** పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా లో నూతనంగా నిర్మించిన శ్రీ భక్త మార్కండేయ మహాదేవాలయ ప్రారంభోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డిలకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో నారాయణఖేడ్ పద్మశాలి సంఘం, వైదిక పురోహితులు బ్రహ్మశ్రీ గురురాజు శర్మ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు.

# రోడ్డు పనులు పూర్తి.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



**శివంపేట్ ఫిబ్రవరి 21( సిరి న్యూస్ )** మొదటి విడుతలో రోడ్డు పనులు పూర్తి కావడంపై ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఈ రోడ్డు బీటీ రోడ్డు శిథిలావస్థకు చేరి గుంతలతో కొన్నేళ్లుగా అవస్థలు ఎదురుకున్న ప్రజలు, ప్రయాణికులు మొదటి విడత రోడ్డు పూర్తి కావడంతో అవస్థలకు స్వస్తి పలికారన్నారు. గత బీఆర్ఎస్ హాయంలో తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ హాయంలో నిధులు మంజూరు కావడంతో శివ్వంపేట మండలం ఉసిరికపల్లి, భీమ్లతండా, శంకర్ తండా , పాంబండ, పోతులబొగుడ గ్రామాల ప్రజలకు అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి, అప్పటి రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేశారు.పనులు ప్రారంభమై నత్తనడకన సాగడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పై అధికారులను ఎప్పటికప్పుడు రోడ్డు పనులపై ఆరాతీసి పనులను వేగవంతం అయ్యేలా కృషి చేసినందుకు పరిసర గ్రామాల ప్రజల తరుపున ప్రత్యేకకృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ హాయంలోనే మండలంలోని తౌర్యతండాకు బీటీరోడ్డు నిర్మాణ పనులకు రూ. కోటి 54లక్షలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు. రెండవ విడుతలో చండి గ్రామం నుంచి గోమారం మీదుగా అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉసిరికపల్లి మాజీ సర్పంచ్ మర్రిగోపాల్ రెడ్డి మాజీవార్డుసభ్యులు పోతరాజు లింగం బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకోండి

ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి



**పెద్దశంకరంపేట,(సిరిన్యూస్):** ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పై అవగాహన ఉన్న కూర రఘోత్తమ్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఎస్టీయు రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట మండలంలో కూర రఘోత్తమ్ రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎస్టీయు భవనంలో విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత ఆరు సంవత్సరాల ఎమ్మెల్సీగా ఉండి ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి రఘోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. అధ్యాపకుల ఉపాధ్యాయుల సమస్యలు ఎన్నో పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా ఎస్టీయూ పనిచేస్తుందని, సమస్యలపై అవగాహన ఉన్న కూర రఘోత్తమ్ రెడ్డికి ఎస్టీయు మద్దతిస్తుందని అన్నారు. 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూర రఘోత్తమ్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.టీ.యు.జిల్లా మాజీ అధ్యక్షులు బోండ్ల శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయులు, రామచంద్రచారి, ఎస్టియు మండల అధ్యక్షులు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి వెంకటేష్ ఉన్నారు.

# పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు



**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్):** విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును పొంది, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రమ శిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుంద న్నారు. విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, దుర్వసనాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అదిరోహించవచ్చన్నారు. <తల్లి దండ్రులు ఎంతో కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకొని కళాశాలకు పంపిస్తున్నారని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, బృంద నృత్యాలు, పాటలు పలు ప్రదర్శనలు పలువురిని అలరించి విశేషంగా ఆకట్టుకున్నాయి. లెక్చరర్లు హరిత, అనంత్ రాజ శర్మ, ప్రభాకర్, రమేష్, రాజు, శ్రీశైలం, మల్లేశం, జహీరా బేగం, కిష్టారెడ్డి, విజయ భాస్కర్, శ్రీలత, అశ్విని, తదితరులున్నారు.

# విద్యాపీఠం కృషి అభినందనీయం

మాజీ మంత్రి జానారెడ్డి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 21 ( సిరి న్యూస్ ):** ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాల్లో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్ర ప్రదేశ్ మాజీ హోం శాఖ మంత్రి జానారెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్మిస్తున్న 1.08 కోటి రుద్రాక్షలతో శివలింగాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రపంచంలోనే మొదటిసారిగా రుద్రాక్షలతో శివలింగాన్ని ఇక్కడే తయారు చేస్తున్నామని విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి జానారెడ్డికి వివరించారు. గతంలో భస్మ లింగం, పత్ర లింగాలను కూడా మహాశివరాత్రికి తయారు చేసినట్లు సిద్ధాంతి వివరించారు. ఆశ్రమంలో కైలాస ప్రస్తార మహా మీరు పంచముఖ ఉమామహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం కూడా జరుగుతుందని జానారెడ్డికి తెలిపారు. ప్రకృతి నుంచి వచ్చిన వస్తువుల మాత్రమే దేవాలయంలో వాడుతున్నామని పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జానారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్ కుమార్, దారం సంజయ్, విట్టల్ దాస్, రాజేంద్ర మహేందర్, భైరవ ప్రసాద్ పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక సాయం



**చేగుంట ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** మెదక్ జిల్లా చేగుంట మండలంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సర్వ శిక్ష ఉద్యోగులు జైత్రంతాండకు చెందిన మాలోత్ రమేష్ , చందాయిపేట్ గ్రామానికి ఎర్ర శ్రీనివాస్ కుటుంబాలను పరామర్శించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ వారి కుటుంబాలకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ మరణించిన సమగ్ర శిక్షణ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం పది లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఎస్ ఎ జిల్లా అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ



**చేగుంట, ఫిబ్రవరి 21 సిరి న్యూస్ :** మెదక్ జిల్లా చేగుంట మండలం అనంతసాగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఫర్జానా ఆధ్వర్యంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధిస్తూ పాఠశాల నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొని,డి ఈ ఓ గా మహేందర్,ఎం ఈ ఓ గా శివప్రసాద్, హెచ్ ఎం గా విష్ణు వర్ధన్, ఉపాధ్యాయులుగా వైష్ణవి, భవాని, మేనక,నందిని, శ్రావ్య,శృతి, ప్రవీణ్ , అఖిల్,వంశి,మధు, అవినాష్ ,లు బాధ్యతలు నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ , బాల పోచయ్య ,జ్యోతి, రాఘవేంద్ర ప్రసాద్ ,రంజిత్ పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**చేగుంట, ఫిబ్రవరి 21 సిరి ఫ్యూస్ :** మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని చందాయి పేట్ గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్ మక్కారాజు పేట్ ప్రభుత్వ పాఠశాలలో (సిఆర్‌పి ) గా పనిచేసేవాడు, గత కొన్ని రోజుల క్రితం బైక్ ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటనలో తమ మిత్రుడు ఎర్ర శ్రీనివాస్ చనిపోయారు అనే విషయం తెలుసుకొని, 1999-2000 ఎస్ ఎస్ సి మిత్ర బృందం వారి సగృహం లోవారి కుటుంబాన్ని పరమార్శించి ఫోటో కి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి తోచిన సాయం 20వేల రూపాయలు నగదును వారి కుటుంబానికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో శిలా బాలేష్, కుమార స్వామి గౌడ్, రమేష్, తుమ్మ మధు , తాలూకా ఎల్లయ్య,దుబాశి భాస్కర్,సూర్య ప్రకాష్ అచంపేట్ స్వామి,బాలమళ్ళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం





**సంగారెడ్డి, ఫిబ్రవరి 21 ( సిరి న్యూస్ ):** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దుచేసి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలన్న లక్ష్యంతో మతాల పేరుతో హిందుత్వ ఎజెండాతో పరిపాలన చేయాలని చూస్తుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు దుయ్య బట్టారు. శుక్రవారం సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా సంగారెడ్డి ఏరియా కమిటీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి సాయిలు మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ సర్కార్ నూతన ఆర్థిక విధానాలను నయా ఉదార వాద విధానాలను చాలా వేగవంతం అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతూ అంబానీ, ఆదానిలకు మోడీ సర్కార్ మారిందనరు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బాలరాజు, రమాదేవి రాజు, నర్సింలు, లక్ష్మణ్, లగ్గం దుర్గయ్య, విట్టల్ ,శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## దాడిచేసినవారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 21(సిరి న్యూస్)** రాయికోడ్ మండలం పిప్పడ్పల్లి గ్రామంలో ఎస్సి కులానికి చెందిన మామిడి సుమన్ చింత చెట్టు ఎక్కి చింతకాయ తెంపిండని కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి లో జరిగిన కెవిపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అతిమేల మానిక్ మాట్లాడారు. పోలీస్ స్టేషన్లో పిటిషన్ వచ్చి ఆరు రోజులు గడిచిన ఇప్పటికి ఎటువంటి చర్య తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. అరెస్టు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, కెవిపిఎస్ నాయకులు రాజయ్య, బాబురావు తదితరులు ఉన్నారు.

# సాగుకు నీళ్లివ్వండి.. రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటిని పంపింగ్ చెయండి



**ఆందోళనలో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలి. యాసంగి పంట కాలం పూర్తి అయ్యేంత వరకు పంట పొలాలకు సాగునీటిని అందించాలి. రంగనాయక సాగర్ లో రెండు విడుతలుగా నీటిని పంపింగ్ చేయాలి. మిడ్ మానేరు నుండి రంగనాయక సాగర్ లోకి మరో ౨.౫ టీఎంసిల నీటిని పంపింగ్ కు ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వండి. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి లేఖ ద్వారా రైతుల పక్షాన విజ్ఞప్తి చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.**

**సిద్దిపేట, ఫిబ్రవరి 21 (సిరి న్యూస్ )** :సిద్దిపేట నియోజకవర్గం లో గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి పంటకు నియోజకవర్గ ప్రాంతం లోని రంగనాయక సాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగు నీటిని అందిస్తున్నామని. ఈ యేట యాసంగి పంటకాలం పూర్తి అయ్యే వరకు సాగు నీటిని అందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి రైతుల పక్షాన లేఖ ద్వారా కోరిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు.. నియోజకవర్గం లో గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి పంటకు నియోజకవర్గ ప్రాంతం లోని రంగనాయక సాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగు నీటిని అందిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు..దాని వలన రైతులకు మంచి పంట రాబడి పెరిగింది. రంగనాయక సాగర్ కింద ఇలా ప్రతి యేటా గణనీయంగా పంట రాబడి పెరుగుతుందన్నారు. ఈ ఏటా 50వేల ఎకరాల పంట ఉన్నదని లేఖ లో పేర్కొన్నారు. రంగనాయక సాగర్ లో ఇటీవల మీరు 2.4 టి ఎం సిల నీళ్లు పంపింగ్ చేశారని ప్రస్తుతం రంగనాయక సాగర్ లో 1.85 టీ ఎం సి ల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు.. యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందాలి అంటే ఇంకా 2.5 టి ఎం సి ల నీళ్లు అవసరం ఉన్నాయ న్నారు . కావున మిడ్ మానేరు నుండి రెండు విడుతలుగా రంగ నాయక సాగర్ లోకి నీళ్లు పంపింగ్ చేయాల నీ ఇరిగేషన్ అధికారులను ఆదేశించగలరని విజ్ఞప్తి చేశారు.రైతు లు సాగు నీళ్లు లేక తీవ్ర ఆందోళన లో ఉన్నారని గుర్తు చేసారు..గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి కి రైతులకు సాగు నీరు అందించినట్టు గా ఈ యాసంగి పంట కాలం పూర్తి అయ్యేఅంత వరకు రైతుల పంట పొలాలకు సాగు నీరు అందిచాలని సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన తమరికి విజ్ఞప్తి చేయుచున్నట్లు లేఖ ద్వారా కోరారు...

# పెరిగిపోతున్న సైబర్ నేరాలు

- ఖాతాలో నుండి డబ్బులు మాయం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు, బ్యాంకుల అధికారులు



**రామాయంపేట ఫిబ్రవరి 21 (సిరి న్యూస్) :** ప్రతిరోజు టీవీలు, వార్తాపత్రికలు, సోషల్ మీడియా లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పదేపదే సూచించడం జరుగుతుంది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్ల ఆటలు సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులు మీ బ్యాంకు ఖాతా పనిచేయడం లేదని ఓటిపి వస్తుంది చెప్పాలని, ఉచితంగా ఖరీదైన గిఫ్టులు మీ పేరుతో వచ్చాయని ఓటిపి పంపి వారిని తిరిగి ఆ ఓటీపీ చెప్పాలని అడుగుతున్నారు. దీంతో తమకు నిజంగానే అలా జరిగి ఉంటుందని నమ్మిన వ్యక్తులు నేరుగా తమ ఓటీపీని చెప్పడంతో అకౌంట్లోని డబ్బులు కాజేస్తున్నారు. ఇదిలా ఉండగా మరి కొందరు సైబర్ నేరగాళ్లు బ్యాంకుల వద్ద పడి కాపులు కాసి బ్యాంకులో డబ్బులు జమ చేసిన వారిని గుర్తించి ఏదో విధంగా వారి నెంబర్లు సేకరించి నేరుగా వారికి ఫోన్ చేసి మాట్లాడి తలోబాలకు గురిచేసి డబ్బులు కాజేయడం జరుగుతుంది. తెలిసి తెలియని వారు మోసపోతుంటే అన్ని తెలిసిన యువకులు సైతం ఈ నేరాలకు బలైపోతున్నారు. ముఖ్యంగా ఆన్ ఆన్ లైన్ గేమ్ లకు అలవాటు పడి ఆన్లైన్ లోన్ యాప్ లకు ఆశపడి తమ వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లకు తెలపడం జరుగుతుంది. అలా కాకుండా తల్లిదండ్రుల అకౌంట్లు సైతం చెప్పడం వల్ల మొత్తం కుటుంబంలో సైబర్ నేరాలకు బలి కావలసిన దుస్థితి నెలకొంటుంది.

ఈ విషయంలో పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించడం జరుగుతుంది. అయి నప్పటికీ ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల ఈ సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఒక్కో సందర్భంలో అత్యవసర పరిస్థితుల కోసం దాచుకున్న డబ్బులు సైతం సైబర్ నేరగాళ్లు కాజేయడంతో దిక్కుతోచని స్థితిలో పలువురు ఎవరికి చెప్పాలో అర్థం కాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్లు వస్తే వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దని పోలీసులు పదేపదే సూచిస్తున్నారు.అపరిచిత ఫోన్ కాల్స్ కు వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు: రామయంపేట సిఐ వెంకట రాజా గౌడ్... ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు బాగా పెరిగిపోయాయి.

ముఖ్యంగా రామయంపేటలో గత ఆరు నెలల కాలంలో ఆర్ కేసులు నమోదు కాగా 7 లక్షల పైగా డబ్బులు సైబర్ నేరగాళ్లు కాజేయడం జరిగింది. ఈ విషయంలో మా శాఖ ఎప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తుంది. అంతేకాకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడంతో పాటు అపరిచిత ఫోన్ కాల్స్ వస్తే తమను సంప్రదించాలని చెప్పడం జరుగుతుంది. ఒకవేళ బ్యాంకులో నుండి డబ్బులు సైబర్ నేరగాళ్లు కాజేస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ సంప్రదించి టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ విషయంలో ఎంత నమ్మదగిన వ్యక్తి అయిన తమ బ్యాంకుకు సంబంధించిన గాని ఇతర లావాదేవీల వివరాలు ఇవ్వవద్దని సూచించారు.